

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఫర్ఫెక్షనిస్టులు

**మా కోడలి అత్తయ్యా మావయ్యా** వచ్చి వెళ్ళారు వాళ్ళింటికి. మా కోడలు మలయాళీ, వాళ్ళ అత్తని చేసుకున్న మామయ్య గుజరాతీ పటేల్. ఆయన చాలా పర్ఫెక్ట్‌గా ప్లాన్ చేసుకుంటారట ఏ విషయమైనా. వాళ్ళు అమెరికా వెళ్ళేరోజు చెక్‌లిస్ట్ మా వియ్యపురాలు నాకు చూపించింది. అందులో లిస్ట్.. చెయ్యవలసిన పనులు. టు ఫిల్ $H_2o$, (నీళ్ళు.. ఆయన కెమికల్ సైటిస్ట్ మరి) ఫోటో విత్ అమ్మా (అంటే తొంభై ఏళ్ళ అత్తగారు) హగ్స్ టు యంగర్ వన్స్, సమ్ హెల్దీ స్నాక్స్ ఫర్ మంచింగ్, సూట్‌కేస్ – 1 (అందులో చెక్ చెయ్యాల్సినవి, మేల్ క్లోత్స్, వులెన్స్, సాక్స్, లేడీస్ క్లోత్స్, హేండ్ బాగ్స్, పర్సెస్.. సూట్‌కేస్ –2 ఎసెన్షియల్ మెడిసిన్స్, స్వీట్స్, ఉస్మానియా బిస్కెట్స్, న్యూ ఇయిర్ డైరీస్.. ఇలా అన్నీ వున్నాయి. హేండ్ లగేజ్‌లోవి సెపరేట్‌గా.

నాకు చాలా ముచ్చటేసింది. మా అక్కచెల్లెళ్ళం కలిస్తే ఒళ్ళు మరిచి కబుర్లాడుకుని, తిరిగి వచ్చేసాక 'అయ్యో ఒక ఫోటో అయినా తీసుకోలేదే... మళ్ళీ ఎప్పుడు కలుస్తామో? ' అనుకున్న సందర్భాలు అనేకం.

పిల్లాడు పుట్టిన ఆర్నెల్లకి పుట్టు వెంట్రుకలు తీయించడానికి తిరుపతి వెళ్తూ, తీరా స్టేషన్ కి వెళ్ళాక, పిల్లాడి పాలడబ్బాలూ, సీసాలున్న బుట్ట ఆటోలో పెట్టుకోలేదని గుర్తొచ్చింది. దేవతలా.. ఆ కాచిగూడా రైల్వే స్టేషన్‌లో జనం మధ్యలో బుట్ట చంకన పెట్టుకునొస్తూ మా ఆడబడుచు కనిపించింది.

మా అబ్బాయి నాకన్నా ఘోరం. మొన్న అమెరికా వెళ్తూ పాస్‌పోర్ట్ ఇంట్లో మర్చిపోయాడు. ఎటొచ్చీ మూడు గంటల ముందు వెళ్ళడం వలనా, రేపిడో వాడి డెలివరీ వలనా, లక్కీగా ఆ రోజు మా కోడలు ఆఫీస్‌కి వెళ్ళకుండా ఇంట్లో వున్నందువలనా, పాస్‌పోర్ట్ అంది ఫ్లయిట్ ఎక్కాడు. మరి నా కొడుకేగా. విత్తొకటి వేస్తే చెట్టొకటి వస్తుందా?

వాళ్ళ మావగారి పేరు సుబ్రమణ్యం. ఆయనది 'సుబ్ స్టాండర్డ్' అని పేరు పెట్టాడు మా అబ్బాయి. ఏదీ ఒకంతట నచ్చదు. చాలా హై స్టాండర్డ్‌లో వుంటే తప్ప. ఆయనకి నచ్చకపోతే అది 'సబ్ స్టాండర్డ్'ట! నా అదృష్టం కొద్దీ నేను రెకమెండ్ చేసే ఆస్పత్రులూ, హోటల్స్ 'సుబ్ స్టాండర్డ్'లో ఉంటాయని ఆయన నిర్ధారించాడుట.

నేనొకసారి ఓ ఫ్రెండ్ ఇంటికి పనిమీద వెళ్ళాను. మా డిస్కషన్ అయ్యేసరికి వాళ్ళావిడ వస్తుందనీ, భోజనం చేసి వెళ్ళమనీ అతను నన్ను ఆపాడు. ఆవిడ రాలేదు కానీ ఫోన్ చేసి నాకు ఇమ్మని" అన్నీ రెడీగా వున్నాయి. బట్ వేడి చేసుకుని తినేయండి. నేనూ బయల్దేరుతున్నాను. మధ్యలో జాయిన్ అవుతాను.ఫ్రిజ్ దగ్గరకి వెళ్తే మీకే ఎందులో ఏం వున్నాయో బోధపడ్తుంది" అంది.

నేను ఫ్రిజ్ దగ్గరకి వెళ్తే, ఒక కాయితం ఫ్రిజ్‌కి అంటించి వుంది. పులిహోరా ఇన్ రెడ్ బాక్స్, బెండకాయ ఫ్రై అని గ్రీన్ బాక్స్, రైస్ ఇన్ రైస్ కుక్కర్, చట్నీస్ ఇన్ కప్‌బోర్డ్. సెకండ్ రో ఫీ. ఇన్ థర్డ్‌రో.. లాస్ట్ బట్ వన్. ఫ్రూట్ సలాడ్ ఇన్ ఫ్రిజ్, లోయర్ డోర్.

పొందికగా రాసి అతికించి, ఒక స్మైలీతో 'సారీ' అని వుంది.

"నేను వస్తున్నాననా? మీ ఆవిడ ఇంతేనా" అని అడిగాను.

"ప్రతీది ఇంత  ఆర్గనైజ్‌డ్‌గా చేస్తుంది ఖర్మ. ఆ స్టాండర్డ్స్ అందుకోలేక ఛస్తున్నాను" అన్నాడు.

మా ఇంటి పక్కావిడ మామగారు పోయినప్పుడు ఆవిడ ఏడుస్తూ, ముక్కు చీదుతూనే, కొడుక్కి ఫోన్‌లో "అగర్ బత్తీలూ, పూలదండలూ మర్చిపోకు. ఆ వంటావిడకి ముప్పై మందికి భోజనం అని చెప్పు. పోయినసారి పులుసులో బెల్లం ఎక్కువ వేసింది. ఈసారి వెయ్యద్దను. అప్పడాలు అక్కర్లేదు. మళ్ళీ వాటికి అదనంగా చార్జ్ చేస్తుందేమో? ఎంతమంది శవాన్ని తీసుకెళ్ళిపోయాక కూడా వుండి, స్నానాలు చేస్తారో వాళ్ళ తలలు లెక్కపెట్టి మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పు" అనడం విన్నాను.

మరి దాన్నే స్థిత ప్రజ్ఞత అంటారో, లేక కార్య దక్షతో! నేను ఇలాంటి ముందు చూపులో పూర్ లెండి.

వరుసకి పిన్ని ఒకావిడ, మనం వాళ్ళింటికి వెళ్తుంటే "సగం దూరం వచ్చారా? ఎంత దూరం వచ్చారూ?" అని అడికి కుక్కర్ పెట్టేది. వేడిగా వుండాలని తాపత్రయం పాపం అనుకున్నాను నేను. కానీ అమాయకంగా ఆవిడే ఒకసారి "ఇలాగే మా బాబాయ్ వస్తూ వస్తూ ఏక్సిడెంట్ అయి అటునుండి అటే హాస్పటల్‌కి వెళ్ళారు. వండిన అన్నం అంతా మిగిలిపోయింది. అందుకే గుమ్మంలోకి వచ్చాకే వండాలని అప్పటినుండీ నిశ్చయించుకున్నానే" అంది. తెల్లబోయాను.

కొంతమందికి ప్లానింగ్‌తోపాటు టైమింగ్స్ చాలా పర్టిక్యులర్‌గా వుంటాయి. మనం వెళ్ళినా సరే, వాళ్ళు ఎనిమిదిన్నరకల్లా నిద్రపోవాలి అంటే, ఆవలించకుండానే లేచి మన చెయ్యి కలిపి "గుడ్‌నైట్" అంటారు. మావారు పెళ్ళయిన

కొత్తల్లో నా ఫ్రెండ్స్ వస్తే అలాగే చేసి, వెళ్ళి పడుకునేవారు. కష్టపడి ఆ అలవాటు మానిపించాను. వాళ్ళమ్మగారు టైముకి తినడం, టైముకి పడుకోవడం అలా అలవాటు చేసారుట.

ఇంకొకావిడ మా ఇంటికొచ్చి వాళ్ళాయనతో, 9 కాగానే "టీవీ ఎక్కడ? మా ఆయన వార్తలు చూడాలి" అని తొందర పెట్టింది. నేను మా డ్రాయింగ్ రూములో టి.వి తీసేసాను. నా బెడ్‌రూములో, గెస్ట్ బెడ్‌రూములో మాత్రమే టి.విలుంటాయి. ఆయన్ని గెస్ట్ రూములోకి పంపిస్తే శాంతించాడు. మా ఫ్రెండ్ దాని పెళ్ళయిన కొత్తల్లో వాళ్ళాయనని మా ఇంటికి తీసుకొచ్చి మా అమ్మతో "అత్తయ్యగారూ ప్రొద్దుట ఏడింటికే ఆయనకి బ్రేక్‌ఫాస్ట్ కావాలి అలవాటు పాపం. ఉప్మా చేస్తే జీడిపప్పు ఎక్కువగా వెయ్యండి లేకపోతే తినరు. వంటలో ఎందులో జీలకర్ర వెయ్యకండి ఆయనకి ఆ వాసన పడదు. ఫిల్టర్ కాఫీ స్ట్రాంగ్‌గా లేకపోతే తాగరు. సరిగ్గా పన్నెండున్నరకి లంచ్ తింటారు. ఒక నిముషం అటూ ఇటూ కాకూడదు" అని చెప్పింది. ఓసారి అంటే అలా చేస్తాం కానీ అది నెలకి రెండుసార్లు ఆయన్ని తీసుకునొచ్చేది. ఆయన ఈ పలహారాలు, భోజనాలూ టైముకి చెయ్యడం తప్ప ఉలుకూ పలుకూ కబుర్లు చెప్పడం ఏవీ ఉండేవి కావు. ఎందుకొస్తాడురా బాబూ! అవన్నీ టైం ప్రకారం ఇంట్లో చేసుకుంటూ వుండక, అనిపించేది. అమ్మకి పాపం స్వంత అల్లుడితో ఇంతగోల వుండేది కాదు.

కొందరు ఆడవాళ్ళకి టీ.వీ సీరియల్స్ పిచ్చి ఇలాగే ఎడిక్షన్ అయి కూర్చుంటుంది. ఓ అభిమాని మా ఇంటికొచ్చి "కార్తీక దీపం " టైం అయిపోతుంది నేను దార్లో వుండగా అయిపోతుందేమో కాస్త టీ.వీ పెడ్తరా?" అని అడిగితే "మా ఇంట్లో టీ.వి కనెక్షన్ లేదు" అని చెప్పేసా.

ఈ పిచ్చిలన్నీ వదిలేస్తే మా పెద్దమ్మగారు చాలా ఆర్గనైజ్డ్ గా వుండేవారు. ఆవిడ తనతోబాటు ఓ బుట్ట తెచ్చేవారు. అందులో ఆవిడ మందులూ, స్వయంగా కొట్టుకున్న వక్కపొడి సీసా, వానొస్తే గొడుగూ, చలివేస్తే కప్పుకునే షాల్, ఎండాకాలం అయితే విసినికర్రా, పొందిగ్గా కోసి పెట్టుకున్న పళ్ళముక్కలూ, వెళ్ళిన చోట వుంటుందో లేదోనని ఆవకాయ భరిణలో, కాస్త శొంఠిపొడీ, దగ్గు వస్తుందేమోనని అమాన్ దస్తాలో కొట్టిన కరక్కాయ ముక్కలూ, అన్నీ వుండేవి.

మా మావగారు తనతోబాటు కరివేపాకు పొడీ, సైంధవ లవణం, భావనా జీలకర్రా అన్నీ చిన్న చెక్కపెట్టెలో తీసుకెళ్ళి ఎవరింట్లో అయినా, అవన్నీ మజ్జిగలో నానపెట్టి భోజనానికి ముందు, అరగంట తర్వాత తినేవారు. తర్వాత సరిగ్గా ఇరవై నిమిషాలు పడక్కుర్చీ అడిగి అందులో నిద్రపోయేవారు.

ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఏనభయి ఆరేళ్ళు బ్రతికారు. ఆరునుండి ఎనిమిది కిలోమీటర్లు చివరిదాకా రోజూ నడిచేవారు.

మా అమ్మమ్మ ఎవరింట్లో పురుళ్ళు అయినా, పెళ్ళి పనులన్నా ముందే వెళ్ళి, అన్ని ఏర్పాట్లూ చూసేది. పెళ్ళి అంటే అప్పట్లో వంట బ్రాహ్మల్ని మాట్లాడి, గాడి పొయ్యిలు తవ్వించి, ముందుగా మిఠాయిలూ, పిండి వంటలూ చేయించేవారుగా. ఈవిడ స్టోర్ రూం ఇన్‌ఛార్జ్ డ్యూటీ తీసుకునేది. ప్రతిరోజూ కావలసిన సరుకులు లెక్కగా రాసుకుని, తెప్పించి ఇవ్వడమే

కాకుండా, అవి వృధా కాకుండా అక్కడే కూర్చుని చూసేది. ఇంక గంధపు వుండలూ, పురికోసా, పొట్లాల దారం, నవధాన్యాలూ, పసుపు కొమ్ములూ, కుంకుమ, కర్జూరాలూ, తలంబ్రాలలోకి చిట్టి ముత్యాల బియ్యం ఇలా డబ్బాల మీద రాసిపెట్టేది. పిండి వంటలన్నీ డబ్బాల్లో సర్ది, స్టోర్ రూం తాళాలు రొంటిన దోపుకునేది. ఏ వస్తువు అవసరం పడినా, హడావిడి పడకుండా "రవణ దొడ్డని అడిగితే ఠక్కున ఇస్తుంది" అని ఇంటివాళ్ళు నిశ్చింతగా వుండేవారు.

అలాగే పురుళ్ళూ పుణ్యాలూ అంటే అమ్మాయి నీళ్ళాడినప్పుడు వెళ్ళినావిడ, పసివాడికి నెలవెళ్ళి, కాస్త ఒళ్ళు చేసి, తల్లి తనంతట తను నీళ్ళు పోసుకునేదాకా, వాళ్ళింట్లో వుండి బాలింతకి పథ్యం, అనుపానాలు చూసి, పిల్లాడికి చాదు బొట్టు చేసి, ఉగ్గుపట్టి, రోజూ మాలిష్ చేసి, నీళ్ళు పోసి, ఇంక పరవాలేదు అనుకున్నాక ఇంటికి వచ్చేసేది.

ఫలానా వారి అమ్మాయికి నెలలు నిండాయి, ఇంక రేపో మాపో పురుడొస్తుంది అనగానే, ఈవిడ పాత చింతకాయ పచ్చడీ, శొంఠి పొడీ, కాయం, పాత చీరలూ, కుంపటీ, అందులోకి సాంబ్రాణీ, తాంబూలానికి కావలసినవీ అన్నీ బుట్టలో సర్దుకునేది.

"అమ్మయ్యా వచ్చేసావా అత్తయ్యా" అనో "పిన్నీ" అనో "అమ్మమ్మా" అనో, ఆ సదరు బాలింత తల్లి తేలిగ్గా నిట్టూర్చేది. ఇప్పుడు పాలు తాగడం పిల్లలకీ, ఇవ్వడం తల్లులకీ నేర్పే స్పెషలిస్ట్‌లని మెటర్నిటీ హోమ్స్ లో పెడుతున్నారు. అప్పుడు అలాకాదు, అన్నీ తల్లికి పెద్దవాళ్ళు దగ్గరుండి నేర్పేవాళ్ళు. కడుపుతోటున్నప్పుడు "ఓ ముద్ద తక్కువ తినండి" అని, పురుడొచ్చాక "అన్నం తిని నిద్రపోకండి" అనీ చెప్పేవాళ్ళు. తాంబూలం చుట్టి ఇచ్చేవాళ్ళు. కుంపటితో కాపు కాసేవారు. ధూపం వేసేవారు. వేడికోసం కస్తూరి మాత్రలిచ్చేవారు. ఇవన్నీ పర్‌ఫెక్ట్‌గా చేసేవాళ్ళు.

Post your comments







